## ఎంఏ ఇంగ్లీష్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ దూర విద్య ద్వారా అందించే ఎంఏ ఇంగ్లీష్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఇంగ్లీష్ (నాన్ ఇంటర్నల్), ఎంఏ ఇంగ్లీష్ (ఇంటర్నల్) పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెస్సీ (ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్) అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఎమ్మెస్సీ (మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 12వ తేదీలోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అలాగే ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్‌ఐఎస్సీ, ఎంజే అండ్‌ఎంసీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 19 లోపు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఎంఫిల్ ఇన్ క్లినికల్ సైకాలజీ మొదటి సంవత్సరం పార్ట్ 1, రెండో సంవత్సరం పార్ట్ 2 రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, పీఎస్‌వై. డీ క్లినికల్ సైకాలజీ అన్ని సంవత్సరాల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 20 లోపు చెల్లించాలి. బీఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 23 వరకు చెల్లించవచ్చు. బీఎస్ - ఎంఎస్ (ఫైవ్ ఇయర్స్ ఇంటిగ్రేటెడ్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రాం) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఎమ్మెస్సీ (ఆడియాలజీ), ఎమ్మెస్సీ (స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ) కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 26 లోపు చెల్లించాలి.

## 'బీఫార్మసీ' రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు..

ఓయూ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు అధికారులు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున, ఈ నెల 13లోపు టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. జవాబు పత్రాల నకలుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున.. ఈ నెల 13వ తేదీలోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## నేడు నిమ్స్‌మేలో లోన్ మేళా..

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 6 : నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే క్యాంపస్‌లో బుధవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు లోన్ మేళా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు మేళాలో పాల్గొననున్నారు. వివరాలకు 040-23633244/218/261 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## రోహన్‌కు పసిడి..

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) అంతర కాలేజీల వుషు చాంపియన్‌షిప్‌లో రోహన్ పసిడి పతకంతో మెరిశాడు. మంగళవారం ఎల్బీ స్టేడియం వేదికగా జరిగిన పురుషుల 48కిలోల పోరులో వీన్ సీసీ కాలేజీకి చెందిన రోహన్ స్వర్ణం దక్కించుకున్నాడు. మిగతా విభాగాల్లో సౌద్ అలీ(52కి), సుమిత్(56కి), రోహిత్(60కి), సాద్‌బిన్(70కి), అబ్బాస్‌ఖాన్(75కి), ఇబ్రహీం(80కి), జమాల్(85కి), అబ్దుల్లా(90కి), బుర్హన్(90+కి) స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఓయూ ఐసీటీ కార్యదర్శి కృష్ణ హాజరై పతకాలు అందజేశారు.

# ఔటర్ పై మరో మూడు ఇంటర్ చేంజ్‌లు

కొత్తగా ప్రతిపాదనలు రూపొందిస్తున్న హెచ్‌ఎండీఏ అధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గ్రేటర్ చుట్టూ 158 కి.మీ మేర ఉన్న ఓఆర్ఆర్ మీదుగా కోర్ సిటీ లోపలి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు వీలుగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతో పాటు ప్రత్యేకంగా రేడియల్ రోడ్లు, లింకు రోడ్లు ఉండటంతో నగర వాసులు ఓఆర్ఆర్‌ను రాకపోలకు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రతియేటా ట్రాఫిక్ రద్దీ 15 నుంచి 20 శాతం వరకు పెరుగుతోంది. ఇప్పటికే ఐటీ కారిడార్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో కొత్తగా రెండు ఇంటర్‌చేంజ్‌లను నార్సింగి వద్ద నిర్మించి ప్రారంభించారు. అలాగే కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌ను అనుసంధానం చేస్తూ మరో ఇంటర్‌చేంజ్ నిర్మాణంలో ఉంది. పటాన్‌చెరు-దుండిగల్ మార్గంలో మల్లంపేట-బాచుపల్లి వద్ద మరో ఇంటర్‌చేంజ్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. అయినా ట్రాఫిక్ పెరుగుతుండటంతో మరిన్ని చోట్ల కొత్తగా 3 ఇంటర్‌చేంజ్‌లను నిర్మించాలని ప్రాథమికంగా హెచ్‌ఎండీఏ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఔటర్ దాటిన తర్వాత ప్రాంతాల్లోనూ పట్టణీకరణ శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఇంటర్‌చేంజ్‌ల వారీగా వాహనాల రాకపోకలు గుర్తించి కొత్త ఇంటర్‌చేంజ్‌ల నిర్మాణంపై దృష్టి సారించారు.

### కోహెడ వద్ద మరో ఇంటర్‌చేంజ్..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత హైదరాబాద్ మహానగరాభివృద్ధి అంతా పడమర దిక్కున ఉన్న ఐటీ కారిడార్ వైపు ఎక్కువగా జరగడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పెరిగింది. దానికి అటువైపు 3 ఇంటర్‌చేంజ్‌లను నిర్మించిన హెచ్‌ఎండీఏ, ఇప్పుడు దక్షిణం, తూర్పు, ఉత్తరం దిక్కుల వైపు ట్రాఫిక్ పెరుగుతున్నట్టు తమ అధ్యయనంలో గుర్తించారు. ఇందులో మొదట కోహెడ వద్ద , కీసర -శామీర్‌పేట మధ్య, అలాగే 3వ ఇంటర్‌చేంజ్‌ను శామీర్‌పేట- దుండిగల్ మధ్య నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. మూడు ప్రాంతాల్లో ఔటర్ రింగు రోడ్డుకు కలిసే లింకు రోడ్డు, రేడియల్ రోడ్లను పరిగణలోకి తీసుకొని వాటికి సమీపంలో ఇంటర్‌చేంజ్ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. గ్రేటర్ చుట్టూ ఉన్న ఓఆర్ఆర్‌కు 22 ఇంటర్‌చేంజ్‌లు ఉండగా, కొత్తగా మరో మూడు చేంజ్‌లను 1-2 ఏళ్ల వ్యవధిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా హెచ్‌ఎండీఏ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. కాగా ఓఆర్ఆర్ నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు 30 ఏళ్లకు లీజుకివ్వడంతో ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న గ్రోత్ కారిడార్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధిపై అధికారులు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. ఇంటర్‌చేంజ్‌ల సమీపంలో టౌన్‌షిప్‌లతో పాటు మినీ పారిశ్రామిక వాడల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించే పనిలో హెచ్‌ఎండీఏ ఎస్టేట్ విభాగం ఉంది.

**రోజుకు ఔటర్‌లో వాహనాల రద్దీ (వాహనాల వారీగా)**

| | |
|---|---|
| సాధారణంగా రోజువారీ వాహనాల రద్దీ | శాతం |
| కార్లు/జీపు/వ్యాన్/ఎల్ఎంవీ | 77.84 |
| ఎల్‌సీవీ/మినీ బస్ | 6.63 |
| బస్/2-యాక్సల్ ట్రక్ | 3.83 |
| 3-యాక్సల్ కమర్షియల్ వెహికల్ | 4.99 |
| హెచ్‌సీఎం/ఈఎంఈ/4/5, 6 యాక్సల్ ట్రక్ | 6.67 |
| 7 చక్రాల కంటే ఎక్కువ ఉన్న వాహనాలు | 0.04 |

**ఔటర్ రింగు రోడ్డు స్వరూపం**

| | |
|---|---|
| ప్రాజెక్టు వ్యయం | రూ. 6696 కోట్లు |
| ఔటర్ రింగు రోడ్డు పొడవు | 158 కిలోమీటర్లు |
| స్పీడ్ లిమిట్ (వాహన వేగపరిమితి) | 120 కిలోమీటర్ ఫర్ అవర్ (కేఎంపిహెచ్) |
| రైట్ ఆఫ్ వే (ఆర్ఓడబ్ల్యూ) | 150 మీటర్లు |
| మెయిన్ క్యారేజీ వే | ఎనిమిది లైన్లు |
| సెంట్రల్ మీడియన్ | 5 మీటర్లు |
| సర్వీసు రోడ్లు ఇరువైపులా | రెండు లైన్లు, ఐటీ కారిడార్‌లో 4 లైన్లు |
| ఇంటర్‌చేంజ్‌లు | 22, నిర్మాణం మరొకటి (కోకాపేట ట్రంపెట్) |

ప్రతి రోజు అన్ని రకాల వాహనాలు కలిపి జనవరి-2023 నాటికి ఓఆర్ఆర్‌పై 1.97లక్షల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి.

2021 డిసెంబర్ నాటికి ప్రతిరోజు 1.30వేల వాహనాలు రాకపోకలు సాగించాయి.

2022లో డిసెంబర్ నాటికి ప్రతిరోజు 1.65వేల వాహనాలు రాకపోకలు సాగించాయి.

పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

## అనాథల గుర్తింపు అందరి బాధ్యత

- సామాజిక స్పృహతో సంరక్షించాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- 2700 మంది చైల్డ్ కేర్ సెంటర్ చిన్నారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ): అనాథ పిల్లలకు అండగా ఉండాలని, సామాజిక బాధ్యతగా వారిని సంరక్షించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉన్న చైల్డ్, అనాథ ఆశ్రమాలు, శిశు సంరక్షణ కేంద్రాల్లో ఉండే చిన్నారులకు జారీ చేసిన కుల, ఆదాయ, బర్త్, ఆధార్ కార్డులను పంపిణీ చేశారు. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల సమన్వయంతో అతి సునాయాసంగా వారికి గుర్తింపు, ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడం అభినందనీయమన్నారు. గ్రేటర్ పరిధిలో ఉన్న శిశు విహార్, చైల్డ్ కేర్ సెంటర్లలో ఉన్న దాదాపు 2700 మంది చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశామని మంత్రి పేర్కొన్నారు. అనంతరం జీహెచ్ ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాల కోసం చిన్నారులకు అందించాలనే లక్ష్యంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. రెవెన్యూ, బల్దియా, పలు శాఖలతోపాటు మీ సేవ నిర్వాహకుల సమష్టి కృషితో ధ్రువీకరణ పత్రాలను జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా నెలన్నర చిన్నారులకు బర్త్ సర్టిఫికెట్లతోపాటు, గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్జీజీవోలు, చైల్డ్ కేర్ సెంటర్లతోపాటు, శిశు విహార్ అధికారులు పాల్గొన్నారు.

## పాత నగరంలో బల్దియా కమిషనర్ పర్యటన

### శాస్త్రీపురం ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ మంగళవారం పాతనగరంలోని పలు ప్రాంతాల్లో ఎంఐఎం పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. శాస్త్రీపురం నుంచి జూపార్క్, ఆరాంఘర్ చౌరస్తా వరకు జరుగుతున్న ఎస్ఆర్‌డీపీ ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. చీఫ్ ఇంజినీర్ దేవానంద్‌ను నిర్మాణ పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయాలని, భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని టౌన్‌ప్లానింగ్ విభాగం సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్‌కు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మిరాలం ట్యాంకు సుందరీకరణ పనులను పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన ఇందిరా నగర్, హసన్ నగర్ ,పోలీస్ అకాడమీ ప్రాంతాల్లో పర్యటించి.. శాశ్వత చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముబీన్, ఎమ్మెల్సీ రహమత్ బేగ్ , జీహెచ్ఎంసీ ఎస్ఈ దత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డైరీ ఆవిష్కరణ

విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ ఆఫ్ తెలంగాణ (వీఏఓఏటి) నూతన సంవత్సర డైరీని తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు వీఏఓఏటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య, నాయకులతో కలిసి డైరీని అందజేశారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, వి.పరమేశ్, పి.అనిల్, వి.శ్రీకాంత్, కొండా రెడ్డి, బి.శ్రీనివాస్, మల్లిఖార్జున, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

- జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 6

జీఎంఆర్ ఏరో అకాడమితో ఒప్పందం చేసుకుంటున్న ఒడిశా ప్రభుత్వ మంత్రులు

## జీఎంఆర్ ఏరో అకాడమీతో ఒడిశా ప్రభుత్వం ఒప్పందం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 6: జీఎంఆర్ ఏరో అకాడమి (జీఎంఆర్ ఏఏ) జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విద్య, శిక్షణ నైపుణ్యాల విభాగం స్కిల్ డెవలప్‌మెంట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ వాణిజ్యశాఖతో మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఒడిశా ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు జీఎంఆర్ అధికారులు తెలిపారు. ఒడిశా రాష్ట్ర వాణిజ్య, రవాణా మంత్రి తుకుని సాహు, విద్యాశాఖ మంత్రి ప్రీతి రంజన్ ఘరాయ్, ప్రిన్సిపల్ సెక్రటరి ఉషాపాదీ, జీఎంఆర్ ఏరో అకాడమి సీనియర్ అధికారి మనోజ్ విశ్రా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించే దిశగా చర్యలు తీసుకుంటామని ఒడిశా మంత్రులు పేర్కొన్నారు.

## ఐఐసీటీని సందర్శించిన విద్యార్థులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 06(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని విద్యార్థులు సందర్శించారు. మంగళవారం నగరంలో గోయెంకా స్కూల్ విద్యార్థులు ఐఐసీటీ ల్యాబోరేటరీ, బయోగ్యాస్ ఫెసిలిటీతో పాటు, సెమియోకెమ్, మోల్‌బ్యాంక్, కెమికల్ ఇంజినీరింగ్ తదితర విభాగాలను సందర్శించి పరిశోధకులతో సమావేశమయ్యారు. పాఠశాల విద్యార్థులకు ఇనిస్టిట్యూట్ క్యాంపస్ పరిధిలో జరిగే పరిశోధనలు, కెమికల్ టెక్నాలజీ ఐఐసీటీ పాత్ర, కరోనా వ్యాక్సిన్ తయారీలో ల్యాబోరేటరీ పరిశోధకుల కృషిని

వివరించారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పరిశోధకులు పాల్గొన్నారు.

# నమూనా అద్భుతంగా ఉండాలి

### మూసీ నది సుందరీకరణపై ఆర్కిటెక్చర్లతో సీఎం రేవంత్‌రెడ్డి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు కంపెనీల ప్రతినిధులతో బేటీ అయ్యారు. ఇటీవల లండన్, దుబాయ్ పర్యటనలో సీఎం అక్కడి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టులను పరిశీలించారు. దుబాయ్‌లో పలు విదేశీ కంపెనీలు, డిజైన్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్సల్టెన్సీ నిపుణులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తదుపరి సంప్రదింపుల్లో భాగంగా హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు వివిధ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు. ఇందులో భాగంగా సింగపూర్‌కు చెందిన మెయిన్ హర్ట్ కంపెనీ ప్రతినిధులు సీఎంతో బేటీ అయ్యారు. వివిధ దేశాల్లో తాము చేపట్టిన ప్రాజెక్టు డిజైన్లతో పాటు హైదరాబాద్‌లో మూసీ డెవలప్‌మెంట్‌కు అనుసరించాల్సిన ప్రాజెక్టుల నమూనాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నమూనాలు రూపొందించాలని, సీఎం కంపెనీ ప్రతినిధులకు సూచించారు. మెయిన్ హర్ట్ గ్రూపు సీఈఓ ఒమర్ షహజాద్, సురేశ్ చంద్రతో పాటు ప్రతినిధి బృందం సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎం.డి ఆమ్రపాలి పాల్గొన్నారు.

### కన్సల్టెన్సీ సేవల ఎంపికకు నోటిఫికేషన్ జారీ..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. మూసీ నదికి సంబంధించిన 'సిమ్యులేషన్ మోడల్ ఫర్ హైడ్రాలిక్స్ ' ప్రాజెక్టును రూపొందించేందుకు కన్సల్టెన్సీలను ఆహ్వానించింది. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయని అధికారులు తెలిపారు. ఉస్మాన్‌సాగర్(గండిపేట) దిగువ భాగం నుంచి మొదలు కొని ఓఆర్ఆర్ గౌరెల్లి వరకు, అలాగే హిమాయత్‌సాగర్ చెరువు కింది భాగం నుంచి బాపూఘాట్ వరకు మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా కన్సల్టెన్సీలు పనిచేయాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## ట్రాఫిక్ కారక బస్ షెల్టర్ల తరలింపు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): ట్రాఫిక్‌కు ఇబ్బందులు కల్గించే విధంగా ఉన్న ఆర్టీసీ బస్ షెల్టర్లను మరో ప్రాంతానికి తరలించడం, వాటి నిర్వహణపై దృష్టి సారించేందుకు ఆర్టీసీ, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సంయుక్తంగా ఒక కమిటీ వేయాలని నిర్ణయించారు. మంగళవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో ట్రాఫిక్ సమస్యలకు సంబంధించిన వివిధ అంశాలపై నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ (ఈవీ అండ్ డీఎం) డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, ట్రై పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీలు, ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, తదితర అంశాలపై మాట్లాడారు. భవన నిర్మాణ వ్యర్థాలను తరలించే మినీ టిప్పర్లు, ట్రాక్టర్లను నగరంలోకి అనుమతించే అంశాలపై కూడా చర్చించారు.

సీఎం రేవంత్ రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ గచ్చిబౌలి మ్యూచువల్లీ హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీకి రూ.20 కోట్లు మంజూరు చేయాలని, సొసైటీ రెండో ఫేజ్‌కు రిజిస్ట్రేషన్ అనుమతి ఇవ్వాలని సొసైటీ అధ్యక్షుడు, తెలంగాణ శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ కోరారు. ఈ విషయంపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

- సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 6

## డబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీ

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 6: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా దేశ వ్యాప్త కార్యకలాపాలు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సమావేశాలలో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించింది. ఈ మేరకు అఖిల భారతీయ జనరల్ సెక్రటరీ నరేంద్ర బండారి, అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా రావికంటి శ్రీనివాస్‌లను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

## ప్లేయర్లకు తగిన ప్రోత్సాహం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ ప్లేయర్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ దిగ్గజాలు ముందుకు రావాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షిక వేడుకల్లో యువ షూటర్, అర్జున అవార్డు గ్రహీత ఇషాసింగ్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్న ఇషాసింగ్‌కు లక్ష రూపాయల చెక్కును జగన్‌మోహన్‌రావు అందజేశారు. తెలంగాణలో క్రీడాభివృద్ధికి త్వరలో మేధావులు, నిపుణులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఇషాసింగ్‌కు చెక్కును అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

## నేటి నుంచి 'కేర్'లో ఉచిత పీడియాట్రిక్ కార్డియాక్ శిబిరం

బంజారాహిల్స్,ఫిబ్రవరి 6: పుట్టుకతో వచ్చే గుండె సమస్యలను గుర్తించడంతో పాటు చికిత్స విధానాలపై అవగాహన కల్పించేందుకు బంజారాహిల్స్ రోడ్ నం. 1లోని కేర్ ఆస్పత్రిలో బుధవారం నుంచి ఈ నెల 14వరకు ఉచిత పీడియాట్రిక్ కార్డియాక్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పిల్లల్లో శ్వాస సరిగా అందకపోవడం, వేగంగా శ్వాస తీసుకోవడం, ఎదుగుదల సరిగా లేకపోవడం, బరువు పెరగకపోవడం, పెదవులు పాలిపోయినట్లు కనిపించడం తదితర లక్షణాలు ఉంటే పీడియాట్రిక్ కార్డియాలజిస్టును సంప్రదించాలన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు, 2డీ ఎకో పరీక్షలపై 50శాతం తగ్గింపు ఉంటుందన్నారు. వివరాలకు 94919 59409 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుతో అద్భుతమైన అవకాశాలు లభిస్తాయని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. నిమ్స్ దవాఖానలో ఎంహెచ్ఎం కోర్సు విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఎంఎహెచ్ఎం కోర్సు అకడమిక్ ఇన్‌చార్జి, నిమ్స్ అనుసంధానాధికారి డాక్టర్ మార్త రమేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్, ఫిబ్రవరి 6

## శ్రీయాకు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి వేదికగా జరిగిన జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో శ్రీయా వెన్న స్వర్ణ పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన బాలికల అండర్-8 ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో శ్రీయా సత్తా చాటింది. సాషా సుర్, శ్రేష్ఠ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. వేర్వేరు కేటగిరిల్లో ఆద్యషా(రజతం), అనికా ప్రశార్(స్వర్ణం), శ్రీకరి(రజతం), కావ్య(స్వర్ణం,రజతం), అన్హ చౌహాన్(రెండు రజతాలు), ఇరా గౌతమ్(రెండు కాంస్యాలు), మహిజ(రెండు రజతాలు) పతకాలను దక్కించుకున్నారు. విజేతలకు పోటీల నిర్వాహ